# తృప్తి

## బాలన్

''ఇదిగో! పంతులు నువ్వు చెప్పేది నమ్మలేకపోతున్నాను. ఖాళీగా నీళ్లు లేక ఎండిపోయి బీడులు పారిన నేలలో షూటింగ్ చేస్కోడానికి ఒక్క రోజుకి లక్షరూపాయలా? ఏంటి పంతులు చెవిలో పువ్వు పెడుతున్నావ్. బాగా బ్రతికి చెడినవాన్ని. అత్యాశలు చూపకు.'' అని గంగిరెడ్డి చెప్పడంతో, పంతులు అతని చేతుల్ని పట్టుకున్నాడు.



''గంగిరెడ్డన్నా. మీ దగ్గర అబద్ధం చెబుతానా?... రెండు నెలలుగా మన పల్లెటూరు, చుట్టు ఉన్న పొలాల్లో, పొలిమేర్లలో సినిమా షూటింగ్ చేస్తున్నారు తెలుసుగా?''

''ఎందుకు తెలియదు. అందరు పని పాట వదులుకుని షూటింగ్‌ను ఎగబడి చూస్తున్నారుగా.''

''నేనూ అప్పుడప్పుడు ఆ వింతని చూడటానికి వెళ్లాను. వారెవ్వా డబ్బుల్ని నీళ్ళలా ఖర్చుపెడుతున్నారు! వాళ్లకి డబ్బులు కాసే చెట్లు ఉన్నాయా? అంత విచ్చలవిడిగా ఖర్చుపెడుతున్నారు. హీరోయిన్‌కి కావల్సిన జతబట్టల కోసం రెండు కార్లు హైదరాబాద్‌కి వెళ్ళివస్తాయంటే నమ్మగలమా?''

''రెడ్డన్నా. పటేలా వాళ్ళదగ్గర డబ్బులున్నాయ్. ఖర్చుపెడుతుండ్రు.''

''సరే. మన పొలాలికి ఎందుకు లక్షరూపాయలు ఇస్తుండు. జర మంచిగా చెప్పండ్రి.

''పటేలా. రెడ్డన్నా. వాళ్ళు తీస్తున్న సినిమాలో, జర గీతాంజలి సినిమాలో ఓ ప్రియా.. పాట లెక్కన గిక్కడే తీస్తారట. గదే మరి. గా డైరెక్టరుకి మన గ్రామంలో బీడులు పారి ఎడారిలా ఉండే భూమి

కావాలట. ఓ ముఖ్య సన్నివేశంతో బాటు, పాటలు చెయ్యాలట. ఒక్కరోజుకి లక్షరూపాయలిస్తానని చెప్పిండట. మిమ్మల్ని... మీతో జర కల్సి మాట్లడమంటే షూటింగ్ చేస్కొనే ఏర్పాట్లు చేసాను. తప్పయిపోయిందా?''

''ఏంది పంతులు సినిమావాళ్ళ రూపంలో దేవుడు (కుబేరుడు) పరకాయ ప్రవేశం చేసినట్లు తీసుకొచ్చావ్. తప్పయిపోయిందని చెప్పడానికి నా దిమాక్ కరాబు కాలేదుగా...'' అంటూ గంగిరెడ్డి చెప్పగానే పంతులు కళ్ళల్లో కన్నీళ్ళు.. గంగిరెడ్డి పటేల్ షాకయ్యాడు.

''ఏం పంతులు. గిప్పుడెందుకు కంటతడి పెడుతున్నావ్?''

''మరేం లేదు పటేల్. గతాన్ని గ్యాపకం చేసుగున్నా. రాజాదిరాజులా బ్రతికిన మీరు బంధువులని నమ్మి పత్రాలలో సంతకాలు పెట్టి, మగాణి, మెట్ట భూమిలు వదులుకుని ఏకాకిగా బ్రతుకుతున్నారు. గదే తలిచాను.. కళ్ళల్లో నీరు కారుతుంది.''

''వదిలేయ్ పంతులు. డబ్బులు వస్తాయి. పోతాయి. ఇంతకీ మన పొలమంతా ఎడారిలాగానే ఉందిగా. షూటింగ్‌కు కావలసిన ఒంటెలు లేవుగా...'' అన్నాడు గంగిరెడ్డి.

''ఆ సినిమా డైరెక్టర్ భలే తెలివైన వాడు. షంషాబాద్, చేవెళ్ళ, తొండూరు ప్రాంతాల్లో రాజస్థాన్ నుండి గుంపులు గుంపులుగా వస్తున్న ఒంటెలను చూశాడట. అందులోని ఒకతనితో మాట్లాడి వంద ఒంటెలకు కిరాయి మాట్లాడేశాడట. ఆ ఒంటెలు ఇప్పుడు ఇక్కడికి వస్తాయి.

ఆ ఒంటెలు పాపం! చస్తూ బ్రతుకుతూ డొక్కలెండి కనీసం వాటికి పిడికెడు గడ్డి వేయక రోడ్డు ప్రక్కనున్న ఆకులు తింటూ బ్రతుకుతున్నాయి. అలాంటి ఒంటెలలో మన పొలంలో షూటింగ్ చేస్తారట. బాధతో మూల్గాడు గంగిరెడ్డి.

''గంగిరెడ్డి పటేలా, ఆ లొల్లి మనకెందుకు? ఒంటెల్ని పెట్టి షూటింగ్ లేదు గుర్రాలు పెట్టి షూటింగ్ చేస్తారో మనకెందుకు. మనకు కావాల్సింది పైసలు. నోరు మూసుకుని ఊరుకో. భూమి శుభ్రం చేయడానికి కూలీలు వస్తారు. ఈపాటికి అక్కడే ఉండొచ్చు. జర మన పొలంలో షూటింగ్‌ను మనం చూడకుండా ఉంటే మంచిగా ఉంటుందా?

గంగిరెడ్డి, పంతులుతోబాటే వెళ్ళాడు.

పొలంలో ఓ ప్రక్కన కార్లు పెద్ద పెద్ద వేన్లు నిలిచి ఉన్నాయి. షూటింగ్ చూడటానికి వచ్చిన మందితో రద్దీగా ఉంది. గంగిరెడ్డిని డైరెక్టర్‌కి పరిచయం చేసాడు పంతులు.

''వావ్. ఎంత పెద్ద పొలం. సూపర్బ్. మా హైద్రాబాద్‌లో ఇలాంటి ఎడారి పొలం లేదు. ఎస్టేట్‌లు, క్లబ్‌లు, రిసార్ట్‌లున్నా యంతే.'' అంటూ షూటింగ్ కార్యక్రమాల్లో నిమగ్నమైనాడు డైరెక్టర్.

> ''మరేం లేదు పటేల్. గతాన్ని గ్యాపకం చేసుగున్నా. రాజాదిరాజులా బ్రతికిన మీరు బంధువులని నమ్మి పత్రాలలో సంతకాలు పెట్టి, మాగాణి, మెట్ట భూములు వదులుకుని ఏకాకిగా బ్రతుకుతున్నారు. గదే తలిచాను. కళ్ళల్లో నీరు కారుతుంది.''

గంగిరెడ్డి, పంతులు ఓ సైడ్‌లో వింత చూస్తూ కూర్చున్నారు.

లవ్ ఫెయిల్యూర్ సాంగ్‌ని షూట్ చేస్తున్నారు. లైలా మజ్నూలా హీరో హీరోయిన్లు పరుగిడుతున్నారు.

గంగిరెడ్డి షూటింగ్‌ను చూస్తున్నా అతని మదంతా ఒంటెల పైనే ఉంది. ఆయన కళ్లు షూటింగ్ కోసం అలంకరించబడిన ఒంటెలను చూస్తున్నాయి.

షూటింగ్ ముగిసింది. తీసిన షాట్‌లు, సీన్స్‌తో డైరెక్టర్ సాటిస్‌ఫై అయినందున షూటింగ్ యూనిట్‌కు పేకప్ చెప్పాడు. గంగిరెడ్డికి లక్షరూపాయలు ఇచ్చేసాడు.

షూటింగ్ టీమ్ అక్కడనుండి బయల్దేరింది. చివరిగా ఒంటెల వ్యాపారి ఒంటెలను తీసుకెళ్ళడానికి వచ్చాడు. అతన్ని దగ్గరికి పిలిచాడు గంగిరెడ్డి.

''ఏమన్నా మీది ఏ ఊరు?''

''మహారాష్ట్రలోని ఏదో ఊరు పేరు చెప్పాడు.

''ఈ ఒంటెలు ఎన్ని పైసలు జేస్తది?''

''ఏముంది. ఓ లక్ష పైసలుంటాయ్.''

''ఒంటెలను నేనే కొనుక్కుంటా. లక్షరూపాయలు ఇచ్చేస్తాను.''

అతను దిగ్భ్రాంతికి గురయ్యాడు.

నీకెందుకు పటేలా? ఇవి ఎందుకు పనికిరావు. రాజస్థాన్ ఎడారిలో మంచి ఒంటెలున్నాయి.

''అన్నా. ఈ రోజు పనికి రాదని చెబుతున్నా ఈ ఒంటెలు ఒకప్పుడు ఎడారి పడవలు. ఒడలుగా కష్టబడ్డాయి.''

''నిజమే పటేల్ సాబ్.. కాని జర నడవడానికి పనికిరాని వీటిని ఏం చేస్తావ్?''

గంగిరెడ్డి కళ్ళల్లో కోపం, తెల్లని మీసాలను మెలేసాడు. అన్నా నీకు వయసు ఎక్కువై పోయిందని మీ అమ్మానాన్న నిన్ను ఇల్లు వదలి వెళ్ళమన్నారా? ఈ నోరులేని మూగజీవుల్ని అట్టే భావించాలి. నీకెందుకు డబ్బులు కావాలంతే కదా. ఇదిగో తీస్కో! ఒంటెల్ని వదిలి వెళ్ళిపో. కనీసం వంద ఒంటెల్ని జీవితంలో పెంచానన్న ఆత్మ తృప్తి మిగులుద్ది.''

కాస్త ఎమోషనల్‌గా మాట్లాడాడు గంగిరెడ్డి.

ఆ ఒంటెల వ్యాపారి గంగిరెడ్డి ఇచ్చిన డబ్బును గంగిరెడ్డి కాళ్లపాదాల క్రింద పెట్టి ''నమస్తే ..నమస్తే పటేలే..నువ్వు నిజంగా పటేలువే...'' అంటూ తిరుగుముఖం పట్టాడు.

★

